# చావుపెళ్లి పెళ్లిచావు

రామారావుకి టెలిగ్రామ్ వచ్చింది. ఆఫీసుకి వచ్చింది. విప్పి చూసుకోలేదు. కాళ్ళూ చేతులూ వణుకుతున్నాయి. నోట మాట రావటంలేదు. స్థాణువులా నిలబడిపోయాడు. చుట్టూవున్న అతని తోటి ఉద్యోగస్తులు ఖంగారుగా అతన్నే చూస్తున్నారు. అమాంతం కుర్చీలో కూల బడిపోయాడు. అందుకు కారణం లేకపోలేదు.

సరిగ్గా రెండేళ్ళక్రితం యిలాగే రామారావుకి టెలిగ్రామ్ వచ్చింది. 'అది'కూడా ఆఫీసుకే వచ్చింది. అది వెంటనే విప్పి చూశాడు. అప్పుడు కాళ్ళూచేతులూ వణకలేదు. కానీ విప్పిచూశాకా వణకడం ప్రారంభించి అవాక్కయినిలబడిపోయాడు. చుట్టూ వున్న వాళ్ళు ఖంగారుగా అతన్ని చూసారు. తేరుకుని కుర్చీలో కూల బడ్డాడు. కళ్ళల్లో నీళ్ళు సుడులు, సుడులుగా తిరుగుతున్నాయి. ఆపుకునే ప్రయత్నంచెయ్యలేదు. ధారగా కన్నీళ్ళు కారుతుంటే జేబు లోంచి రుమాలు తీసి కన్నీళ్ళకి అనకట్టకట్టేడు. "నేనే ఈ వార్త చదివి ఇంతలా షాకయిపోయాను. ఇంతలా దుఃఖిస్తున్నాను. ఇంకఈ వార్త మాలతివింటే అబ్బా! ఊహించుకుంటేనే యింత భయంకరంగా, గాబరాగా వుంది. వెళ్ళి ఆ ఘోరమైన దృశ్యం కళ్ళతో చూస్తే ఎలా తట్టుకోగలం? ఏది ఏమయినా ఈ వార్త మాలతికి చెప్పకతప్పదుకదా!" అనుకుంటూ లేచి ఆఫీసరు రూంలోకి వెళ్ళి టెలిగ్రామ్ చూపించి, అతని సానుభూతిని అందుకుని, పరుగులాంటినడకతో బైటికి వచ్చి, అటుగాపోతున్న టాక్సీని అపి, ఇంటి ఎడ్రస్ చెప్పి పొమ్మన్నాడు. నిజానికి టేక్సీలమీద తిరిగే జీతం లాంటి ఉద్యోగంకాదు. ఐనా భార్య మాలతికి ఈ వార్తచెప్పి. రాత్రిబండికి బయలుదేరి వెళ్ళాలన్నదే అతని ఆతృత, ఖంగారు.

ఒక్కగానొక్క బావమరిది ఇంత అకస్మాత్తుగా పోవడం నాకే యింత బాధగావుంది. ముసలి అత్తగారు - అందులో అతనిమీదే ఎన్నో ఆశలు పెట్టుకుని పెంచుకున్న బావమరిది ఇలా ఏక్సిడెంట్‌లో పోయాడంటే ఎలా తట్టుకుంటుందోకదా? ఇంటి కెళ్ళి మాలతికి ఈ వార్త ఎలా చెప్పడం? మాలతికి

తమ్ముడంటే అంతులేని ప్రేమ. ఆమె గుండె చెరువయ్యేలా రోదిస్తుంటే ఎలా ఊరుకోపెట్టాలి? అని ఆలోచిస్తుండగానే డ్రైవరు బ్రేకువేసి తన ఆలోచనలకు స్వస్తిచెప్పించాడు. టేక్సీవాడికి డబ్బులిచ్చి డోర్‌బెల్ నొక్కగానే తలుపు తీసిన మాలతి కొశ్చన్‌మార్కు ముఖంతో రామారావు వైపు చూడసాగింది. మాలతికి టెలిగ్రామ్ అందిచ్చి బోర్‌మన్నాడు రామారావు. తమ్ముడి మరణవార్త విన్న మాలతిని ఊరుకోబెట్టడం రామారావు శక్యం కావటంలేదు. ఇరుగుపొరుగులు వచ్చి అంతా తలోరకంగా బాధపడుతూ ఓదారుస్తున్నారు. అంతా కలిసి మాలతితో - "నువ్వే ఇలా గోలపెడితే మీఅమ్మ ఏమయిపోతుంది? అ ముసలి తల్లి కోసమైనా ధైర్యాన్ని చిక్కబట్టుకుని, మీ అమ్మని ఓదార్చాలి" అంటూ ఊరడించసాగారు.

రామారావు ముందు కర్తవ్యాన్ని గుర్తుకు తెచ్చుకుని, నాలుగు బట్టల్ని పెట్టెలోపెట్టి, ఇంకో రెండు గంటల్లో బయలుదేరనున్న రైలుని అందుకోవాలన్న ఆతృతతో ప్రయాణానికి సిద్ధమవసాగాడు.

మాలతిని, రామారావుని చూసిన ఆ ముసలితల్లి గుండె చెరువయ్యేలా ఏడ్చింది. "తన గతేంకాన"ని గోల పెట్టింది. ఆమె బాధని చూడలేకపోయారు. "ఇంక మమ్మల్నే కొడుకులనుకో అమ్మా!" అంటూ వూరుకో బెట్టసాగింది మాలతి. అవే మాటలు రామారావూ అన్నాడు. ఓ ఇరవై రోజులపాటు ఆమె దగ్గరుండి తిరుగు ప్రయాణమయ్యారు మాలతి, రామారావులు. వెళ్ళేముందు అత్తగారిని, మరదల్ని తమతో రమ్మని చాలా బలవంతం చేసాడు రామారావు. "ఊరుమారితే బాధ కొంచెం మర్చిపోతా"రన్నాడు. ఒంటరిగా వుంటే జ్ఞాపకాలు మరీ బాధిస్తా"యన్నాడు.

"ఇది ఎక్కడికెళ్తే పోయే బాధ బాబూ! ఇరవైఏళ్ల కొడుకుని పోగొట్టుకున్న బాధ ఏంచేస్తే తగ్గుతంది నాయనా? అందునా మీ మరదలు మీనాక్షి బి.ఎ. చదువుతోందికదా? దాన్నొదిలేసి ఎలా రాను? ఎప్పుడో వస్తాలేబాబూ శలవలకి!" అని చెప్పి కూతుర్ని అల్లుడిని సాగనంపింది.

ఇది జరిగి రెండేళ్ళయింది. ఈ మధ్యకాలంలో ఎన్నోమంచి చెడ్డలు జరిగాయి. ఒకరికి మంచి జరిగితే అది మరొకరికి చెడు కావచ్చు. ఒకరికి చెడు జరిగితే అది మరొకరికి మంచి కావచ్చు.

టెలిగ్రామ్ విప్పకుండానే రామారావు పడుతున్న ఖంగారు చూసి పక్కనున్న సారధి ఆ టెలిగ్రామ్‌ని చింపేడు. అందులోని పేరా చదివాడు. గట్టిగానే చదివాడు. "మీనాక్షీస్ మేరేజ్ టెన్తు. స్టార్టు ఇమీడిఏట్లీ."

ఆ పేరా విన్న రామారావు కుర్చీలోంచి ఒక్కదూకు దూకి ఓ వెర్రికేక లాంటిది పెట్టబోయి, మళ్ళీ తన్ను తాను సంభాళించుకుని కుర్చీ పట్టుకుని నిలబడి, వెర్రివాడిలా అందరికేసి చూడసాగాడు.

"చంపేవుకదరా బ్రదర్! నీ టెలిగ్రాము కాదుగానీ అందర్నీ హడలకొట్టేశావుకదా? హార్టీ కంగ్రాచ్యులేషన్సు. అవునుగానీ ఈ టెలిగ్రామ్ చదివేకకూడా ఎందుకలా ఎండిపోయిన బెండకాయలా ముఖం పెట్టి, తోటకూరకాడలా వాలిపోతున్నావు? లక్షణంగా ఓ జత బట్టలొస్తాయిగా" అంటూ స్నేహితులంతా తమ తమ సీట్లలోకివెళ్ళి కూర్చున్నారు.

'విచిత్రమేమిటంటే బావమరిది మరణవార్తకంటే ఈపెళ్ళి వార్త రామారావుని మరీ అధికంగా బాధిస్తోంది. కానీ అనాడు అందర్లో భోరున ఏడవగలిగాడు. ఈనాడు ఏడవలేక, లోపల్లోపలే ఏడుస్తున్నాడు.

"పెళ్ళికి సరిగ్గా రెండు రోజుల వ్యవధేవుంది. అయినా ఈ టెలిగ్రాములమీద పెళ్ళేమిటో! యింతకి ఎవడా దుర్మార్గుడు + అదృష్టవంతుడు? లౌమేరేజా? అంతేఅయివుంటుంది. లేకపోతే ఇంత హడావిడిగా ఎందుకు చేస్తారు?"

రామారావు బుర్రలోని ఆలోచనలు రామారావుని ఆఫీసుపని చెయ్యనివ్వటంలేదు. ఆలోచనల్ని అరికట్టే శక్తిలేదతనికి. పైన సీలింగ్ ఫేన్ ఫుల్ స్పీడ్‌లో తిరుగుతోంది. అంతకు రెట్టింపు స్పీడుతో అతని బుర్రలోని ఆలోచనలు తిరిగిపోతున్నాయి. పైకి చెప్పుకుని ఏడవలేడు. స్వర్గం చెయ్యిదాటిపోతోంది. తన సొత్తనుకున్నది ఎవరిపరమో అయిపోతోంది. పెళ్ళికి వెళ్ళాలా? మానాలా? అన్నది పెద్ద సమస్యగా తయారయింది. వెళ్ళకపోతే అపార్థం చేసుకుంటారన్న భయం వెళ్తే కళ్ళారా ఆ వేడుకని చూసి తనని తాను శిక్షించుకోలేడు. ఆ కోతని భరించలేడు.

రామారావు ఎటూ తేల్చుకోలేకుండా వున్నాడు. మనసువిప్పి ఎవ్వరికీ

చెప్పుకోలేనిబాధ. అందుకే ఇంటి కొచ్చి మనస్సులోని భారమంతా దిగే దాకా ఏడ్చాడు. ఏడ్చేస్తున్నాడు. దుఃఖం ఆగటంలేదు. "ఎందుకేడుస్తారండీ!" అని అడగడానికి ఇంట్లో భార్యకూడా లేదాయె. పిచ్చిగానీ నా భార్యవుండివుంటే ఎందుకేడుస్తాను? పైగా మరదలి పెళ్ళికి సరదాగా పదిరోజులక్రితమే వెళ్ళివుండేవాడినిగా. లేదుగనకే పరాయి వాళ్ళల్లా శుభలేఖ వెయ్యకుండా, దగ్గర బంధువుగా ముందుగారమ్మని రాయకుండా వైర్‌ద్వారా వెంటనే రమ్మని రెండు రోజుల ముంధు మాత్రమే ఆహ్వానించారు.

బావమరిది పోయిన కొద్ది నెలలకే తనకి ఢిల్లీ బదిలీ అయింది. కొడుకు పోవడమే కాకుండా కూతురూ అల్లుడూ దూరం వెళ్ళిపోతున్నారని అత్తగారు బాధపడింది. మధ్యలో వేసవి శలవల్లో అత్తగార్ని, మరదల్ని ఓ సారి తీసుకొచ్చి, నెల్లాళ్ళు దగ్గరుంచుకున్నాడు. మళ్ళీ కొద్దినెలల్లోనే వాళ్ళిద్దరూ ఢిల్లీకి రావలసివచ్చింది. ఈ సారొచ్చింది సరదాగాకాదు. తన అర్ధాంగి మాలతి మరణవార్త తెలియజేస్తూ ఇచ్చిన టెలిగ్రామ్ చూసి లబోదిబోమని మొత్తుకుంటూ వచ్చారిద్దరూ. దూరం అవడంతో వాళ్ళొచ్చేసరికి శవం కూడా లేకపోయింది. ఇంక ఆ ముసలి తల్లి రోదన వర్ణనాతీతం. "ఏడాదిలో ఇద్దరుపిల్లల్ని పొట్టనెట్టుకున్న పాపిష్టిదాన్ని. ఈ వయసులో ఇంకా నన్నెందుకుంచావు దేముడా? ఇంకా ఎంత నరకాన్ననుభవించమని నాకు ఈ అయువు పోసావు? ఎందుకీ పాపిష్టి బ్రతుకు భగవాన్!" అంటూ గోలపెట్టే అత్తగార్ని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్న మరదల్ని ఊరడించలేక పోతున్నాడు"

"నాకు మాత్రం ఎవరన్నారు? మీరు నా దగ్గరే వుండండి. మాలతి పోయినా మన సంబంధం తెగిపోదుకదా? మీనాక్షి చదువుపూర్తయింది కదా ఇక్కడే ఉద్యోగం వేయిస్తాను" అన్నాడు. ఇలాంటివే ఎన్నో కబుర్లు చెబుతూనే వున్నాడు. అందులోని లౌక్యం, స్వార్థం వాళ్ళు గ్రహించకుండా మధ్యలో మాలతిని తల్చుకుని గోడుగోడుని ఏడుస్తూనే వున్నాడు. ఇన్ని మాటల్ని మౌనంగా విన్న అత్తగారు పదమూడో రోజుని మీనాక్షిని తీసుకుని వైజాగ్ వెళ్ళిపోయింది అప్పటికి సరేలెమ్మని వూరుకున్నాడు.

అంతా వెళ్ళిపోయాకా రామారావుని ఒంటరితనం వేధించసాగింది. రాత్రిళ్ళు కంటిమీద కునుకురావటంలేదు. తోడులేకుండా బ్రతకడం దుర్లభం

అనుకున్నాడు. భర్తపోయిన స్త్రీ, పిల్లలు లేకపోయినా జీవితాంతం ఒంటరిగా ఎలా బతకగలుగుతుందో అర్థంకావటం లేదు. పెళ్ళికాని క్రితం తనూ ఒంటరిగానే వున్నాడు. యిప్పుడు ఉండలేడు, యిప్పుడు హొటల్ భోజనం పడటంలేదు.

అంతకంటే బాధ రాత్రుళ్ళు నిద్ర పట్టకపోవటం - మనసులోని కోరికల్ని అరికట్టలేకపోతున్నాడు. ఏదోబాధ, వేదన, ఏవేవో కోరికలు వీటన్నింటి మధ్య అందమైన మీనాక్షి విగ్రహం. ఆమె నిండు యవ్వనం అతని కళ్ళ ముందు ప్రతిక్షణం మెదుల్తోంది. 'నేనూ చక్కటి వాడినే! 'రెండోపెళ్లి' అన్న ఒక్కలోపం తప్ప తనకేంలోటు? అక్కపోతే చెల్లెల్ని బావగారికిచ్చి పెళ్ళిచెయ్యడం లోకసహజమే కదా? అయినా నాకివ్వక ఎవరికిస్తారు? ఆ ముసలితల్లి ఎక్కడ తిరిగి సంబంధాలు వెతకగలదు?" అన్న ధైర్యం వున్నా మనసులో ఓ పక్క ఏదో భయం మెదలుతోంది. "ఐనా సుమారు లక్షరూపాయల ఆస్తి, ఇల్లు వీటికి తగ్గట్లు చదువూ, చక్కదనం అన్నీ వున్నాయి మీనాక్షికి. వీటన్నింటికీ ఆశించి గద్దలా ఎవరేనాతన్నుకు పోవచ్చు. "ఆ భయంతోటే కొద్ది నెలలు గడవగానే దూరపు బంధువుల ద్వారా అత్తగారికి తన కోరికని తెల్లియజెయ్యటమే కాకుండా, ఓసారి వైజాగ్ వెళ్ళి అత్తగారివద్ద నాలుగు రోజులుండి వచ్చాడు కూడా. ఆ రోజుల్లో అత్తగారులేని టైము చూసి మరదలితో పరాచికా లాడేవాడు మీనాక్షి ముఖంలో ఏభావమూ కనపడేదికాదు.

ఓ సారో రాత్రి దొడ్లో ఆమెని వాటేసుకున్నప్పుడు మాత్రం అషహ్యంతో అతన్ని చీదరించికొట్టడం చీకట్లో స్పష్టంగా కనిపించింది. "తొందరపడ్డానేమో!" అనుకున్నాడు. 'పెళ్లయితే అన్నీ సర్దుకుపోతా'యన్న ధైర్యం అతనిలో వున్నా, ఎందుకో ఈ ఆస్తి, అందాల భరణి చేయిదాటి పోతుందేమో అన్న భయం కూడా లేకపోలేదు.

అందుకే వెళ్తూవెళ్తూ అత్తగారితో "మాలతి జాగాని మీనాక్షి నింపితే బాగుంటుంది. పెళ్ళి చేసుకోమని మా బంధువులు పోరుపెట్టినా పైపిల్లని చేసుకుని మాలతికి అన్యాయం చెయ్యలేను" అని డైరెక్టుగా అడిగి ఓ ఏడుపు ఏడ్చేశాడు.

"బాబూ ఏడాదిలో ఇద్దరి పిల్లల చావుల్ని కళ్ళారా చూశాను. పిల్ల పోయి

ఏడాది కాలేదు. మరో పిల్ల పెళ్ళి ఎలా చెయ్యగలను నాయనా! అంటూ ఏడ్చింది. 'అదీనిజమే' అనుకుని తన తప్పిదానికి, తొందరపాటుకి సిగ్గుపడి వెళ్ళిపోయాడు.

అత్తగారి మాటలు రామారావుకి ధైర్యాన్ని కలిగించాయి. ఏడాది దాటేక అడగొచ్చన్న ధైర్యంతోటే రోజుల్ని లెక్కించసాగాడు.

అటువంటి తరుణంలో మరదలి పెళ్ళి టెలిగ్రాము రావడం అతని నెత్తిమీద పిడుగు పడినట్లు వుండటంలో ఆశ్చర్యమేముంది! అతని ఆశలన్నీ నిరాశలైపోయాయి. కట్టుకున్న గాలిమేడలన్నీ కూలిపోయాయి. ఒక్కసారిగా ఆకాశం మీద నుంచి నేలమీదకి పడినట్లుంది. సముద్రంలో మునిగిపోతున్న నావలో వున్నట్లుంది అతని పరిస్థితి. ఎవరి దగ్గరా ఏడ్చే ధైర్యంలేదు. తనలో తనే కుళ్లిపోతున్నాడు.

కోపం పట్టలేకుండా వున్నాడు. చిరాకు వచ్చేస్తోంది. పాపం ఎవరి మీద చిరాకుపడతాడు? అతని ప్లానంతా మట్టిపాలయింది. మనస్సు కుతకుత ఉడికిపోతోంది. చేతికి దొరికిన వస్తువునల్లా విసిరేసి కోపాన్ని తగ్గించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. అయినా తగ్గటంలేదు. కోపం కసిగా మారింది. ఎవరిమీద తీర్చుకోవాలో తెలియటం లేదు. వాళ్ళు చేసిన ద్రోహానికి అమాంతంగా వెళ్ళి పెళ్ళి మండపం తగలెట్టి, ఆ పెళ్ళికొడుకుని హతమార్చి, మీనాక్షి మెళ్ళో మంగళ సూత్రం కట్టాలనివుంది. మరి ఇది సినీమాకాదుగా! వెర్రి మొర్రి ఆలోచనలు ఒకదానితరువాత ఒకటి తరుముకొచ్చేస్తున్నాయి. 'ఓడిపోయాను. ఓడిపోయాను' అనుకున్నాడు.

శ్రమంతా వృధా ఐపోయింది. కక్ష, కసి అతనిలో ప్రజ్వరిల్లి అతన్ని దహించేస్తున్నాయి. డిశంబరు నెల - అయినా గుండెల్లో రగిలిన ఆ మంటలు చమట రూపంగా పైకి ప్రవహిస్తున్నాయి. 'ఏం చెయ్యాలిప్పుడు?'అన్నదే అతని ఆలోచన. ఏం తోచక జుట్టుపీక్కున్నాడు. 'పిచ్చెక్కిపోతోం'దనుకున్నాడు. అశక్తత కోపంగా మారి పిచ్చి వాడిని చేసేస్తోంది. 'లాభం లేదు, లాభం లేదు, ఇంక లాభంలేదు. ఓడిపోయాను, ఓడిపోయాను' అంటూ మంచంమీద కూలబడిపోయాడు.

వారంరోజులపాటు ఆఫీసుకి శలవు పెట్టేడు. వంట్లో బాగోలేదని శలవు

చీటీలో రాసాడు. పెళ్ళికి వెళ్ళడానికి కాదు. వారం రోజుల తరువాత ఆఫీసుకి వెళ్ళేడు. చాలా జబ్బు చేసినట్లుగా చిక్కిపోయి, నీరసపడివున్న రామారావుని చూసి అంతా అతన్ని పరామర్శించారు. అతని ఆరోగ్యం గురించిన జాగ్రత్తలు చెప్పేరు.

రోజులు గడిచిపోతున్నాయి. రామారావు మనస్సే రామారావుని తినేస్తోంది. టి.బి. పేషంటులా ఎండిపోతున్నాడు. ఏ ఉత్సాహమూలేదు. ఎవ్వరితో మాట్లాడటంలేదు. యాంత్రికంగా ఆఫీసుకి మాత్రం వెళ్ళి వస్తున్నాడు. మునుపటి ఉత్సాహం రామారావులో లేకపోవడం అందరికీ వింతగానే వుంది. పిచ్చివాడిలా తయారయ్యాడు. ఏదో వేదన ఎవ్వరితో చెప్పుకోలేని బాధ. ఇంటికెళ్ళాలనిపించటం లేదతనికి. కానీ తప్పటంలేదు.

సాయంత్రం ఆఫీసునుంచి ఇంటి కొస్తే పలకరించే దిక్కులేదు. ఇది వరకు ఇంటికిరాగానే నవ్వుతూ ఎదురొచ్చి తలుపుతీసే మాలతి, వేడి వేడి కాఫీ, టిఫిన్‌లతో స్వాగతం చెప్పే మాలతి లేదు. ఇప్పుడు ప్రతి నిమిషం మాలతి తన తలపుల్లోకి వచ్చి కళ్ళెదుట కనిపిస్తోంది. మూడేళ్ళ దాంపత్యజీవితంలోనూ మాలతి అందిచ్చిన అప్యాయతా, స్వర్గసుఖాలు ప్రతీ సెకనూ గుర్తుకు వస్తున్నాయి. మాలతి పోయాక తను నిజంగా ఆమెకోసం ఏడవలేదు. ఇలా ఒక్కసారయినా ఆమె తనకి చేసిన నిస్వార్థసేవ గుర్తుకురాలేదు. అసలు గుర్తుకు రానివ్వలేదు. మీనాక్షి పెళ్లైపోయాకా నిజంగా మాలతి కోసం ఏడుస్తున్నాడు.

ఆమె చేసిన ప్రతిపనీ గుర్తొస్తోంది. ఆమె అమాయక వదనం, నిష్కల్మషమైన ప్రేమ, నిస్వార్థంతో చేసిన సేవ గుర్తొచ్చి కుళ్ళిపోతున్నాడు. ఆ బాధ ఆగటంలేదు. "నేను నీచుణ్ణి, క్రూరుడిని, పాపిని, దుర్మార్గుడిని అన్న మాటలకున్న పర్యాయపదాలన్నీ నాకే వర్తిస్తాయి" అనుకున్నాడు.

ఆరోజు సాయంకాలం ఆఫీసు నుంచి వచ్చాడు. గేటుముందర టేక్సీ ఆగివుంది. పక్క వాటలో ఎవరి కోసమో అయివుంటుందనుకుని లోపలికి వెళ్ళబోతున్న రామారావుని 'బావా' అన్న మధురమైన పిలుపు గగుర్పాటును కలిగించింది. వెనక్కి తిరిగి చూశాడు. మీనాక్షి! ఆమె వెనక సూటులో ఆమె భర్త!

"బావా! మావారు" అంటూ పరిచయం చేసింది.

షేక్ హాండ్ ఇస్తూ "నేను గుర్తున్నానా అన్నయ్యగారూ!" అన్నాడు వెటకారపు నవ్వుతో.

అంతదాకా వున్న మత్తు ఒక్కసారి వదిలిపోయింది. రామారావు అతన్ని గుర్తుపట్టేడు. అవును అతనే అతనే ఆ డాక్టర్!!

నిజానికి మాలతి, రామారావులది ఎంతో అన్యోన్యమైన దాంపత్యమని అంతా అనుకునేవారు. అనుకోవడంలో ఆశ్చర్యంలేదు. వారి అన్యోన్యతకి కారణం మాలతి ఎప్పుడూ రామారావుని ఏవిషయంలోనూ ఎదిరించి ఎరుగదు. అతనుచేసే ఏపనినీ కాదని ఎరుగదు. అతను చెప్పే ప్రతీ మాటా నిజమే అనుకునేది. నిజం చెప్పాలంటే గొర్రెలా, మౌనంగా ప్రతి దానికీ తలూపేది. ఆమెలోని అమాయకత్వం, ప్రేమ, నిస్వార్ధత, శాంతం, పతిభక్తీ వారి దాంపత్యంలో ఏ ఒడిదుడుకులూ లేకపోవడానికి కారణమని చెప్పాలి. కృత్రిమం, కల్మషం ఎరుగని సాధ్వి. మాలతి అతి సాధుత్వాన్ని రామారావు చాలా అలుసుగా తీసుకుని ప్రతివిషయంలోనూ తనదే పైచేయిగా వుంచుకుంటూ వచ్చాడు. బావమరిది పోయినప్పుడు అత్తవారింటికి వెళ్ళిన రామారావుని ఆముసలి తల్లిదగ్గరున్న ఆస్తి, యిల్లు, మంచి యౌవనంలో అడుగు పెట్టిన అందాల భరిణలాంటి మరదలూ పిచ్చెక్కించాయి 'అవన్నీ తనపరం అయితే ఎంత బాగుండును' అనుకున్నాడు. అప్పుడు మాలతి పల్లెటూరిదానిలా పాతచింతకాయ పచ్చడిలా కనిపించేది. ఆమెకి వచ్చేది సగం ఆస్తేకదా?' అనుకున్నాడు. 'ఆమెని ఏదోఒకలా అడ్డుతొలగిస్తే బంగారు బొమ్మలాంటి మరదలితో లక్షరూపాయల ఆస్తి, ఇల్లు వస్తాయి' లాటరీ తగిలినట్లుగా ఫీలయ్యాడు. మంచి అవకాశం కోసం ఎదురుచూడసాగాడు.

మాలతికి జ్వరం వచ్చింది. మారుమూలగావున్న ఓ డాక్టర్ వద్దకిపోయి ఏదో మందు తీసుకొచ్చి నీళ్ళల్లో కలిపి ఇచ్చి ఆమెని హత్యచేసాడు. తరువాత ఆ డాక్టర్ చేతే ఏదో విషజ్వరమని సర్టిఫికెట్ తీసుకుని, అత్తగారు రాకుండానే దహనసంస్కారాలు ముగించి లక్షరూపాయల ఆస్తి ఇల్లుతో వచ్చే బంగారు చిలుకకోసం ఎదురు చూడసాగాడు. ఆ సత్యాన్ని అప్పుచేసి ఈ డాక్టర్‌కి గుప్పించిన డబ్బుతో కప్పెట్టేశానని ఆశించాడు. ఈ నిజం మరెవ్వరికీ తెలీదని

చాలా ధైర్యంగా వున్నాడు. లోకులంతా కూడా నిజంగా విషజ్వరమే అనుకున్నారు. వారి దాంపత్యాన్ని కొనియాడారు, 'దేముడికి కన్నుకుట్టిం'దన్నారు.

"అయితే ఇప్పుడు మీనాక్షిని పెళ్లి చేసుకున్నది ఈ డాక్టర్నేనన్నమాట! ఘాతకుడా! మనసువిప్పి అంతా నీతో చెప్పుకున్నాను. అప్పుచేసి పదివేలు ముట్టచెప్పేను. అదీ దోచుకుని నా మీనాక్షినీ, ఆమె ఆస్తినీ కూడా నీపరం చేసుకుని నన్ను బికారినిచేసి నువ్వు కులుకుతున్నావురా దుర్మార్గుడా! నాఎత్తుకి పైఎత్తు వేశావుట్రా కౄరాత్ముడా!" అని మనసులో తిట్టుకుంటూ, పళ్ళు పిండుకుంటున్న రామారావుని -

"బాధపడుతున్నావా బావా! నీ ప్లానంతా గంగ పాలయిందని బాధగా వుందా? పాపం రెంటికీ చెడ్డ రేవడివి! దురాశ దుఃఖానికి చేటన్నారు పెద్దలు సగం ఆస్తీపోయె - అక్కాపోయె ఐనా డబ్బుకోసం మా అక్కని చంపేవు. రేపు ఇంకా డబ్బున్నది, నాకంటే అందగత్తైకనిపిస్తే నాగతీ అంతేగా?" అన్న భావం వచ్చేలా నవ్వుతున్న మీనాక్షి ముఖాన్ని చూడలేక రామారావు తలదించుకున్నాడు.

"నా ప్లాన్ ఎలాగుంది భాయీ!" అన్న తోడల్లుడి చూపుల్ని మాత్రం ఒక్క రామారావే గ్రహించగలిగాడు.

బావమరిది చావు, తనకి మళ్ళీ పెళ్ళని ఆనందించిన రామారావుకి మీనాక్షి పెళ్ళి చావయి కూర్చుంది. కాదుమరీ! అందుకే ఇప్పుడు మాలతి మళ్ళీ బ్రతికివస్తే బాగుండునని, లేదా తనూ మాలతి దగ్గరకి వెళ్ళిపోతే బాగుండునని ఏడుస్తున్నాడు రామారావు. చావు పెళ్ళనుకుంటే - పెళ్ళి చావయింది రామారావుకి. పాపం! ✳

**(అక్టోబరు 1982 స్వాతి)**

**డబ్బుకీ, అందానికీ ప్రాముఖ్యత ఇచ్చి, ఇంట్లో భార్యల్ని చాలా చులకనగా చూసి, మానసికంగానూ, శారీరకంగానూ హత్య చేసేవారిలో కొందరయినా ఈ కథ చదివి మారగలిగితే నేను ధన్యురాలినయ్యాననుకుంటాను.**

- రచయిత్రి